క్లుప్తంగా

శృంగార వల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్వామివారికి శనివారం రూ.3,22,466 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు.

గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



వెంకటరాయపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తపల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ సారమ్మ అన్నారు. కొమరగిరి సెక్టార్ పరిధిలోని వెంకటరాయపురం, కొండెవరం గ్రామాల్లో శనివారం పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ర్యాలీ చేసి పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగ, నాగలక్ష్మి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు హర్షవర్ధన్ ఎంపిక



హర్షవర్ధన్‌ను అభినందించిన చైర్మన్, ఉపాధ్యాయులు

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి గొర్త హర్షవర్ధన్ ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హత సాధించినట్టు హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ శనివారం తెలిపారు. హర్షవర్ధన్‌ను, అందుకు కృషిచేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. ఆరుగురి అరెస్టు

సామర్లకోట: స్థానిక క్వారీ గోతుల వద్ద పేకాట ఆడుతున్న శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,600, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆసరాపై సీఎంకు మహిళల కృతజ్ఞతలు



పవరలో ఆసరా లైవ్ కార్యక్రమాన్ని తిలకించిన మహిళలు

సామర్లకోట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరులో ప్రారంభించిన మూడో విడత ఆసరా లైవ్‌ను మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు తిలకించారు. మండల సమాఖ్య అధ్వర్యంలో గ్రామ సమాఖ్య ప్రతినిధులు, యానిమేటర్లు లైవ్ కార్య క్రమాన్ని ఆర్బీకేల్లో ఏర్పాటు చేశారు. మహిళలు ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఎం ఈ కార్యక్రమాన్ని మోనిటరింగ్ చేయాల్సి ఉండగా నిర్లక్ష్యం వహించారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీటీసీ మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాల బాబు తెలిపారు.

పలువురికి దవులూరి దొరబాబు పరామర్శ

సామర్లకోట: పట్టణ పరిధిలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పరామర్శించారు. ఇటీవల ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదంలో పుప్పాల మంగబ్బాయి, పుప్పాల సత్తిబాబు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను దొరబాబు పరామర్శించి తన సానుభూతి తెలిపారు. అదే విధంగా వనమోజు సత్యరవికుమార్ తల్లి ఇటీవల మృతి చెందడంతో సత్యరవికుమార్‌ను, రాష్ట్ర ఎడ్ల పరుగు పందాల విజేత వల్లూరి సత్యేంద్రకుమార్ కుటుంబ సభ్యులను దొరబాబు పరామర్శించారు.

ఉద్యాన సాగు.. సస్యరక్షణతో బాగు

- వర్షాలకు దెబ్బతిన్న మిరప, ఉద్యాన పంటలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు



గొల్లప్రోలు మండలం దుర్గాడలో మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

పిఠాపురం: అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని ఉద్యాన పంటలు దెబ్బ తిన్నాయి. సస్యరక్షణ చర్యలు, తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా పంటలను రక్షించుకోవచ్చని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు గ్రామాల్లో పర్యటించి ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

నేలకొరిగిన మిరప

నియోజకవర్గంలోని గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో రైతులు మిరప పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మిరప పంటలు ముంపు బారిన పడ్డాయి. వర్షాలకు మొక్కలు నేలకొరిగాయి. ఈ నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా నష్టాలను నివారించుకోవచ్చని ఉద్యాన శాఖ అధికారులు అరుణ్‌కుమార్, వెన్నెల తెలిపారు. అధిక వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడిపోవడంతో ఉద్యాన పంటలు ముంపు బారిన పడ్డాయి. అధిక తేమ ఉంటే వేర్ల ద్వారా మొక్క తనకు అవసరమైన పోషకాలను తీసుకోలేదని, పంటను పురుగులు, తెగుళ్ల ఆశించడమే కాకుండా సూక్ష్మధాతు లోపాలు కూడా ఎక్కువ కనిపిస్తాయన్నారు. తగిన జాగ్రతలు తీసుకోవడం ద్వారా పంటలను రక్షించుకోవచ్చని తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలి. వాలిపోయిన మొక్కలను నిలబెట్టి మొదళ్ల వద్ద మట్టిని వేసుకోవాలి. నేల వాలిన మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. ఒళ్లుపోయిన మొక్కలకు లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేటు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు అయితే 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నబేదితో పాటు ఒక నిమ్మ చెక్క రసం కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ , 200 కిలోల వేపపిండి వేసుకోవాలి. నేల అదనుకు వచ్చిన వెంటనే గొర్రుతో అంతర కృషి చేయాలి. మొక్కలు తేరుకున్న తరువాత స్థూల పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు లీటరు నీటికి, సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి ఒకదాని తరువాత ఒకటి వారం వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేసుకోవాలి. మిరప పంట పూర్తిగా ముంపు బారిన పడితే పంటను తీసివేసి ప్రత్యామ్నాయంగా మరో పంటను సాగు చేసుకోవాలి.

చిన్నపాటి జాగ్రత్తలతో నష్టాల నివారణ

రైతులు చిన్న పాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా పంట నష్టాలను నివారించుకోవచ్చు. పంటల్లో ఎటువంటి తేడాలు గమనించినా వెంటనే రైతు భరోసా కేంద్రం సిబ్బందికి తెలియజేయాలి. వ్యవసాయ శాఖ సిబ్బంది వెంటనే పంటలను పరిశీలించి తగిన జాగ్రత్తలు సూచిస్తారు. రైతులు అధికారుల సూచనలు పాటించడం ద్వారా పంట నష్టం వాటిల్లకుండా చేసుకోవచ్చు.

– వెన్నెల, ఉద్యాన శాఖాధికారి పిఠాపురం

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారి వెన్నెల

పిఠాపురం: ఆయిల్‌పాం సాగులో రైతులు విధిగా మెళకువలు పాటించాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖాధికారి వెన్నెల అన్నారు. పిఠాపురం మండలం వెల్దుర్తిలో శనివారం ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆయిల్‌పాం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ పాం రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కల పెంపకం, తెగుళ్ల నివారణ, గెలల కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యతల గురించి రైతులకు వివరించారు. ఉద్యాన శాఖాధికారి పి.అరుణ్‌కుమార్, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు కె.వెంకటేశ్వర్, ఫీల్డ్ ఆఫీసర్ ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ నేరుగా పథకాలు

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- మాధవపట్నంలో ఇంటింటా పథకాలపై ఆరా



మాధవపట్నంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిసున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రభుత్వ పథకాలు నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం మాధవపట్నంలో సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీలు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. గత ప్రభుత్వంలో జన్మ భూమి కమిటీలు ఏం చేశాయో, ఎంత మోసం చేశాయో అందరూ గుర్తుచేసుకోవాలని కోరారు. అర్హత ఉంటే నేరుగా పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయని చెప్పారు. సచివాలయ వ్యవస్థతో ఆయా కార్యాలయాల చట్టు తిరిగే బెడద తగ్గిందన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, రెండో వైస్ ప్రెసిడెంట్ పేర్నిడి వెంకట్రాయుడు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, బొండిలి కార్పొరేషన్ డైరెక్టర్ తోట సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సాధనాల నాగఫణిబాబు, శానిటరీ మేస్త్రి కర్రి శ్రీను, పార్టీ నాయకులు తొలెం లోవరాజు, ఆశా వర్కరు, వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులు, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పట్టు రైతులకు నాబార్డు సేవలు

నాబార్డు డీడీఎం డాక్టర్ వైఎస్ నాయుడు



చేబ్రోలులో పట్టుగూళ్లను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం డాక్టర్ వైఎస్ నాయుడు

పిఠాపురం: పట్టు రైతులు సంఘాలుగా ఏర్పడడం ద్వారా నాబార్డు సేవలను వినియోగించుకోవచ్చని నాబార్డు డీడీఎం డాక్టర్ వైఎస్ నాయుడు అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పట్టుగూళ్ల సాగును శనివారం పరిశీలించారు. సాగు సంబంధించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు రైతులు సంఘాలుగా ఏర్పడడం ద్వారా నాబార్డు నుంచి వచ్చే సబ్సిడీతో వివిధ రకాల పట్టు సాగు సామగ్రి పొందవచ్చన్నారు. నాబార్డు ఆర్థిక సాయంతో విజ్ఞానయాత్రకు వెళ్లే అవకాశం కూడా కల్పిస్తామని ఆయన తెలిపారు. గతంలో చేబ్రోలులో నాబార్డు నిధులతో నిర్మించిన మార్కెట్ షెడ్ సగం మాత్రమే పూర్తి కావడంతో దానిని పూర్తిచేసి మరిన్ని షెడ్లు నిర్మించాలని రైతులు ఆయనను కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి అసంపూర్తిగా ఉన్న మార్కెట్ షెడ్డును పూర్తి చేస్తామని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. డీడీ రామరాజు, టెక్నికల్ అధికారి ఐ. కోటిలింగేశ్వరరావు, మార్కెట్ అధికారి ఐ.శ్రీనివాస్, పట్టు రైతులు పాల్గొన్నారు.

ఆపద మిత్రలకు ముగిసిన శిక్షణ



ఆపద మిత్రలకు సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్

సామర్లకోట: ప్రకృతి వైపరీత్యాల వేళల్లో బాధితులకు సాయం అందించడానికి ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాకు చెందిన ఆపదమిత్రల శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 12 రోజుల పాటు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పొందిన శిక్షణపై ఆపదమిత్రల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విపత్తుల సమయాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే కీలకం అన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని సకాలంలో స్పందించి ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆపద మిత్రలకు రూ.15 వేలు విలువ చేసే కిట్లను అందజేశారు. ఈ కిట్లలో ఉన్న 16 రకాల పరికరాలు ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిసెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్, విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి, ఈటీసీ ఫ్యాకల్టీలు, కేఆర్ నిహారిక, వి.ప్రసాద్, ఎస్‌కే మోహిద్దీన్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ఉత్తమ శిక్షణ పొందిన వారికి మెమెంటోలు అందజేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నాయకర్ కాలనీలో పోసన్నకు ఆర్థిక సహాయం అందిస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పాడ శివారు రామిశెట్టిపేటకు చెందిన కొవ్విరి బండమ్మ, నాయకర్ కాలనీకి చెందిన వంకా సత్యవతి, సురాడ పోసన్న, వాసుపల్లి పొలమ్మలకు రూ.3 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అమీనాబాదుకు చెందిన పిరమళ్ల జోగిరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబానికి మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూ.3 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అమీనాబాదు సర్పంచ్ నక్కా మణికంఠబాబు, మత్స్యకార నాయకులు కంబాల లక్ష్మణరావు, బొందు రాంబాబు, ఎంపీటీసీలు మేరుగు యల్లాజీ, చొక్కా సింగన్న తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం

- రైల్వే స్టేషన్‌లో రెండు టీవీల ధ్వంసం
- ప్రయాణికులపై రాళ్లతో దాడి
- అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్ సిబ్బంది



పోలీసుల అదుపులో ఉన్న ఒడిశా యువకుడు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఒడిస్సాకు చెందిన ఒక వ్యక్తి వీరంగం సృష్టించడంతో ప్రయాణికులు హడలిపోయి పరుగులు తీశారు. శనివారం రైల్వే స్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన రెండు టీవీలను ధ్వంసం చేసి అడ్డు వచ్చిన వారిపై రాళ్లతో దాడి చేయడం తో ప్రయాణికులు పరుగులు తీశారు. దాంతో స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ సమాచారం మేరకు ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మతిస్థిమితం లేక పోవడం వల్లే ఇలా ప్రవర్తిస్తున్నట్లు రైల్వే అధికారులు గుర్తించారు. ఈ వ్యక్తిని ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ స్టేషన్‌లో ఉంచినట్టు మేనేజరు తెలిపారు.

‘ఉపాధి’ కల్పించాల్సింది అధికారులే..

జిల్లా పీడీ వెంకటలక్ష్మి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ వెంకటలక్ష్మి

పెద్దాపురం: అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని ఉపాధి హామీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అడపా వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని ఆనూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆమె పరిశీలించారు. కూలీల శాతాన్ని పెంచి ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో పనులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి ప్రాధాన్యతమిచ్చి ఉపాధి పనులు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. దినసరి వేతనం, కూలీల మస్తరు, పనులు జరుగుతున్న తీరును వెంకటలక్ష్మి పరిశీలించారు. ఆమె వెంట ఏపీఓ స్వామి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్ ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలి

కొత్తపల్లి: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని మాజీ ఎమ్మెల్యే వర్మ అధికారులకు సూచించారు. మండలంలోని ఎండపల్లిలో శనివారం ఆయన పర్యటించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద మురుగునీరు నిలిచిపోవడంతో పాటు చుట్టుపక్కల వ్యర్థాలు పేరుకుపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే పారిశుధ్యం మెరుగుపరిచి విద్యార్థులు అంటురోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట స్వామిరెడ్డి గణేష్, శేషులు, మత్సా వీరబాబు, ముడతా రవిబాబు తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. మండల పరిధిలో వేట్లపాలెంలో జగనన్న లబ్ధిదారులతో ఆమె శనివారం సమీక్షించారు. 161 మంది ఇళ్ల పనులు ప్రారంభించకపోవడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇళ్ల ప్రారంభించక పోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రాజు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు పంచాయతీ కార్యదర్శులు మోషే, ఏపీఎం బి.ప్రశాంతి, ఎంఎస్ అకౌంటెంట్ శ్యామ్ పాల్గొన్నారు. ఉండూరులో స్వచ్ఛ సంకల్పంపై వివిధ మండలాలోని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి కుమార్‌రాజా, ఉప సర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ పాల్గొన్నారు.

‘పది’లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి



కాకరాపల్లిలో ఫిజియోథెరపీ సేవలు పొందుతున్న చిన్నారితో మాట్లాడుతున్న సీఎంఓ నాగేశ్వరరావు

కోటనందూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. అల్లిపూడి కస్తూర్బా విద్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై ఆరా తీశారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం, పరిసరాలను తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన బైజూస్ ట్యాబ్‌లను పరిశీలించి వాటి పని తీరుపై ఆరా తీశారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని మంచి విజ్ఞానాన్ని సంపాదించాలని విద్యార్థులకు సూచించారు. ఇదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల నోట్ పుస్తకాలు, విద్యాకానుకను పరిశీలిచారు.

దివ్యాంగులకు మెరుగైన ఫిజియోథెరపీ సేవలు

ఇంటి నుంచి కదలలేని దివ్యాంగ చిన్నారులకు మెరుగైన ఫిజియోథెరపీ సేవలందించాలని సమగ్ర శిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. మండలంలో గృహ ఆధార ఫిజియోథెరపీ సేవలు పొందుతున్న పలువురి చిన్నారులను శనివారం ఆయన కలిశారు. చిన్నారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఎంఈఓ శ్రీనివాస్, సీఆర్పీలు శేఖర్, బాబ్జీ, ఐఈఆర్పీ రాంబాబు పాల్గొన్నారు.

ఎలా ఊడ్చాలో తెలియక.. మూలకు..

- నిరుపయోగంగా మున్సిపాలిటీ స్వీపర్
- నడిపేవారు లేక ఆరేళ్లుగా ఇదే పరిస్థితి
- ప్రత్యామ్నాయ వాహనం తెచ్చుకోవాలని యోచిస్తున్న అధికారులు



ఇనుము తుక్కుగా మారుతున్న స్వీపింగ్ వాహనం

సామర్లకోట: ముప్పై ఊళ్లు తిరిగి మూలకు చేరిన ముసలమ్మ ఎవరని పొడిస్తే.. చీపురు అని చటుక్కున కథను విప్పేస్తారు. కానీ ఇక్కడ కనిపిస్తున్నది ఊడ్చే చీపురు యంత్రం.. మొబైల్ స్వీపర్. కనీసం ఒక్క అడుగు కూడా తుడవకుండానే ఇలా మూలకు చేరింది. మున్సిపాలిటీలో ఉన్న ఈ స్వీపింగ్ వాహనం ఆరేళ్లుగా మూలనే మగ్గుతోంది. ఈ వాహనం ఉపయోగించే స్థాయిలో రోడ్లు లేక పోవడంతో సుమారు రూ.60 లక్షలు విలువైన వాహనం ఇనుము తుక్కుగా మారుతోంది. ఈ వాహనం నడపడానికి అవసరమైన నైపుణ్యం ఉన్న డ్రైవర్‌కు ఆ స్థాయిలో జీతం ఇచ్చే స్తోమత లేక అప్పట్లో వాహనాన్ని అలా నిరుపయోగంగా వదిలేశారు. ఆరేళ్లపాటు వాహనాన్ని వాడకపోతే దాని బ్యాటరీ, టైర్లు నాణ్యత కోల్పోతాయి. అలాగే వాహన రిజిస్ట్రేషన్, బీమా చేయించకపోవడంతో భారీగా అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంది. అలాగే ఈ వాహనం విడిభాగాలు మన దేశంలో దొరకవని, ఇటలీ నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. ఇప్పటికైనా ఈ వాహనాన్ని కలెక్టర్‌కు అప్పగించి ప్రత్యామ్నాయంగా క్షేత్రస్థాయి పరిస్థితులకు పనికివచ్చే వాహనాన్ని తెచ్చుకోవచ్చని స్థానిక అధికారులు యోచిస్తున్నారు.

పాలక మండలి దృష్టికి తీసుకు వెళతాం



పట్టణంలో రోడ్లు శుభ్రం చేయడానికి ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీలకు స్వీపింగ్ వాహనాలు ఇచ్చింది. ఎందుకు వాడడంలేతో తెలియదు. అనుభవజ్ఞుడైన డ్రైవర్‌తో ఈ వాహనం పరిస్థితిని తెలుసుకుని కౌన్సిల్ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

– హుస్సేన్, మున్సిపల్ డీఈ, సామర్లకోట

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ ర్యాలీ



రంపయర్రంపాలెంలో నిరసన ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం సభ్యులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం సుందరమ్మ సత్రం భూమిలో జీడిపిక్కలను అక్రమంగా తరలిస్తున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వాములు భూస్వాములు సుమారు రెండు నెలల క్రితం నుంచి సత్రం భూమిలో జీడి పిక్కలను కోసుకొని ఎండోమెంట్ అధికారుల సాయంతో తరలించుకుపోయారని ఆరోపించారు. సుందరమ్మ సత్రం భూమికి జగనన్న భూ సర్వేలో భాగంగా నెల రోజుల క్రితం సర్వే జరిగినప్పటికీ భూమికి పాటలు పెట్టడంలో వెనకడుగు వేయడం చాలా దారుణమని అన్నారు. సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ ఎండోమెంట్ అధికారులు భూస్వాములకు మరింత బలం చేకూరుస్తున్నారని ఆరోపించారు. తక్షణమే జీడిపిక్కలను తరలించుకుపోయిన భూస్వాములను, వారికి సహకరించిన ఎండోమెంట్ ఈఓపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పలువురు రైతు కూలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, బాజాభజంత్రీల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు యనమంద్ర శర్మ, చిట్టి శివ ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, యడవిల్లి వెంకటేశ్వరరావు, ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.